

చింతకుంట కార్నర్‌మీటింగ్ మాట్లాడుతున్న వినోద్‌కుమార్

హామీలు అమలు చేయలేక కేంద్రంపై విమర్శలు

- ఎన్ని డ్రామాలు ఆడినా బీఆర్‌ఎస్, కాంగ్రెస్ గెలవలేవు
- ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, మే 1: ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చలేక సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రం విమర్శలుచేస్తున్నారని ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ అన్నారు. బుధవారం నగరంలోని కమాన్ చౌరస్తాలో కార్నర్ మీటింగ్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బీజేపీ గెలిస్తే సీఎం సీటు పోతుందనే భయంపట్టుకుందన్నారు. సీఎం బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లను బద్నాం చేస్తే చట్టపరమైన చర్యలకు వెనుకాడబోమన్నారు. రిజర్వేషన్ల రద్దు నాటకం కాంగ్రెస్ కుట్రలో భాగమేనన్నారు. 2004 నుంచి 2014 వరకు కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ జస్టిస్ వెంకటాచలయ్య కమిషన్ రిపోర్టును ఎందుకు బయటపెట్టలేదని ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీలపై జనం నిలదీస్తుంటే చర్చను పక్కదారి పట్టించేందుకే రిజర్వేషన్ల రద్దు అంటూ డ్రామాలాడుతున్నారన్నారు. ఎన్ని డ్రామాలాడినా బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ఈ ఎన్నికల్లో గెలవలేవన్నారు. ఆ పార్టీలు రెండో స్థానం కోసమే పోటీ పడాలన్నారు. కరీంనగర్‌లో దేవుడిని కొలిచే ప్రతి ఒక్కరూ ఈ నెల 13న ఎన్నికల్లో బీజేపీకి ఓటేయాలని కోరారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి నాన్ లోకల్ అని, పదేళ్లు అధికారంలో ఉన్నా ప్రజలకు చేసిందేమి లేదన్నారు. ఇక్కడున్న మంత్రి నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. కరీంనగర్ అభివృద్ధి కోసం 12 వేల కోట్లకు పైగా నిధులు తీసుకువచ్చానన్నారు. ప్రజల పక్షాన పోరాటం చేసి పాదయాత్ర చేశానన్నారు. అన్ని వర్గా లకు అండగా నిలిచానన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నేతలు ప్రజల కోసం ఏం చేశారని ప్రశ్నించారు. స్మార్ట్‌సిటీ కోసం నిధులు, ఆర్వోబీ కోసం 154 కోట్ల నిధులు తీసుకు వచ్చానన్నారు. పొన్నం, వినోద్‌కుమార్ ఎంపీ లుగా ఉన్న సమయంలో జాతీయ రహదారుల విస్తరణకు నిధులు ఎందు కు తీసుకు రాలేదని ప్రశ్నించారు. పేదల పక్షాన, రైతులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది, దళిత, గిరిజనుల కోసం కొట్లాడానన్నారు. ఆరు గ్యారెంటీలకు మోసపోయి ప్రజలు మీకు ఓట్లేస్తే అమలు చేయకుండా మోదీ గాడిద గుడ్డు కూడా ఇవ్వలేదని హేళన చేస్తున్నారన్నారు. ఆరు గ్యారెంటీలు ఇస్తామన్న మీరు గాడిద గుడ్డు ఇచ్చారా అని ప్రశ్నించారు. బీజేపీ ప్రభుత్వం లేక పోతే దేశం ముక్కలయ్యే ప్రమాదముందన్నారు.



స్ట్రీట్‌కార్నర్ మీటింగ్‌లో ప్రసంగిస్తున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్

● రాజ్యాంగం భగవద్గీత అన్న మోదీ

- కేంద్ర పరిశ్రమలు, మత్స్యశాఖ సహాయ మంత్రి మురుగన్

రాజ్యాంగాన్ని భగవద్గీతగా దేశ ప్రధాని మోదీ అభివర్ణించారని కేంద్ర పరిశ్రమలు, మత్స్యశాఖ సహాయ మంత్రి మురగన్ అన్నారు. బుధవారం రాత్రి కమాన్ చౌరస్తాలో కార్నర్ మీటింగ్ యన మాట్లాడుతూ రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను తాను బతికున్నంత వరకుమార్చే ప్రసక్తి లేదని మోదీ స్పష్టం చేశారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమం కోసం మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. తెలంగాణలో బండి సంజయ్ పాదయాత్రతో దేశమంతా చర్చ సాగిందన్నారు. ధైర్యంతో పనిచేసే బండి సంజయ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని, భవిష్యత్తులో ఆయన కేంద్ర మంత్రి అవుతారన్నారు.

● బీఆర్‌ఎస్ దుకాణం బంద్

భగత్‌నగర్: కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో బీఆర్‌ఎస్ దుకాణం బంద్ అయ్యిందని ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ అన్నారు. బుధవారం నగరంలోని ఎంపీ కార్యాలయంలో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని వివిధ మండలాలకు చెందిన నాయకులు బీజేపీలో చేరారు. బీజేపీలో చేరిన వారికి కాషాయ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ వందరోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ విఫలం కావడంతో ఆ పార్టీని కార్యకర్తలే నమ్మడం లేదన్నారు.



కమాన్ చౌరస్తా వద్ద కేంద్రమంత్రి మురుగన్, ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ భారీ గజమాల వేస్తున్న కార్యకర్తలు



కాషాయ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బండి సంజయ్‌కుమార్

కాంగ్రెస్‌కు ఓటేసినవారు బాధపడుతున్నారు..

- బండి సంజయ్ గెలుపు కోసం ఆలస్యంగా అభ్యర్థి ప్రకటన
- బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్

భగత్‌నగర్, మే 1: కాంగ్రెస్ మాయ మాటలు నమ్మి ఓట్లేసిన ప్రజలు నేడు మోసపోయి బాధపడుతున్నారని బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బోయిన˘ఎల్లి వినోద్‌కుమార్ అన్నారు. బుధవారం రాత్రి చింతకుంట కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. అబద్ధాల పునాదులపై కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ బండి సంజయ్ గెలుపు కోసం టికెట్‌ను ఆల˘స్యంగా ఇచ్చిందన్నారు. ప్రచారానికి వస్తే ఐదేళ్లలో చేసిన అభివృద్ధిపై బండి సంజయ్‌ను నిలదీయాలన్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ మోస పూరిత హామిలతో ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీ మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో వినోద్‌కు˘మార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ అసమర్థ పాలనతోనే కరువు వచ్చిందన్నారు. మూడు నెలల కాలంలోనే కేసీఆర్ పాలన లేని లోటు కనిపిస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్న దాతలు సాగు నీరు, తాగు నీరు లేక ఇబ్బందులు పడుతున్నార న్నారు. కేసీఆర్ పదేళ్ల పరిపాలనలో తెలంగాణ సస్యశ్యామలంగా ఉండేదన్నారు. కాంగ్రెస్ పాలనలో నీరు లేక చెరువులన్నీ వట్టిపోయాయన్నారు. ప్రజల్లో కేసీఆర్‌కు వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక 48 గంటలపాటు ప్రచారాన్ని నిలిపి వేయించారన్నారు. కార్యక్రమంలో టీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్‌రుద్ర రాజు, ఎంపీపీ పిల్లి శ్రీలతమహేష్, వైస్ ఎంపీపీ తిరుపతినాయక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రెడ్డవేణి మధు, శ్రీనివాస్‌గౌడ్, జమీలుద్దీన్, సాబీర్ పాషా, జయప్రకాశ్ రెడ్డి, గంగాధర చందు, రుద్ర రాధ పాల్గొన్నారు.



కార్మిక జెండాను ఆవిష్కరిస్తున్న కరీంనగర్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్

● కార్మికులకు అండగా బీఆర్‌ఎస్ పార్టీ

కరీంనగర్ టౌన్: తెలంగాణ ఉద్యమంలో కార్మికుల పాత్ర మరువ లేనిదని బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. బుధవారం మేడే సంద ర్భంగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో కార్మిక బీఆర్‌ఎస్ కార్మిక విభాగం ఏర్పాటు చేసిన మేడే కార్యక్రమాల్లో పాల్గొని జెండాలను ఆవిష్కరించారు. కార్మికులకు స్వీట్లు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా జరుపుకునే ఏకైక పండుగ కార్మిక దినోత్సవమని అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ కార్మికుల సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి కట్టుబడి ఉందని, వారి హక్కుల కోసం పోరాడుతామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కంసాల శ్రీనివాస్, ఎడ్ల సరిత అశోక్, గంట కల్యాణి శ్రీనివాస్, మేచినేని అశోక్‌రావు, బీఆర్‌ఎస్ కార్మిక విభాగం అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాస్‌రెడ్డి, ఆకుల మల్లేశం, ముత్యాల కృష్ణయాదవ్, హమాలీ సంఘం నాయకుడు రమేశ్, సుల్తానా పాల్గొన్నారు.



వినోద్‌కుమార్, గంగులకమలాకర్‌లను గజమాలతో సత్కరిస్తున్న బీఆర్‌ఎస్‌నాయకులు

● కాంగ్రెస్, బీజేపీని నమ్మొద్దు

కొడిమ్యాల: కాంగ్రెస్, బీజేపీని నమ్మొద్దని బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్ కుమార్ అన్నారు. బుధవారం రాత్రి జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రంలో ఆయన కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ వారు చెప్పిన ఆరు గ్యారంటీలను నమ్మి ప్రజలు మోసపోయారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడు ఊడుతుందో తెలియద న్నారు. రెండేళ్లకో సీఎం మారుతాడన్నారు. కొండగట్టు అభివృద్ధికి బండి సంజయ్ ఏమీ తీసుకరాలేదన్నారు.బీజేపీ మాటలు నమ్మి మోసపోతె ఇక్కడ రేవంత్‌రెడ్డి, ఢిల్లీలో నరేంద్రమోదీ హైదరాబాదును కేంద్ర పాలిత ప్రాంతం చేసెందుకు కుట్రలు చేస్తారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు సుంకె రవిశంకర్, రసమయి బాలకిషన్, జ్వీటీసీ ప్రశాంతి పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ పోలింగ్‌కు పకడ్బందీగా ఏర్పాట్లు


- రేపటి నుంచి పోలింగ్ ప్రారంభం
- కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, మే 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వర్తించే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేలా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులకు సూచించారు. పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కోసం నగరంలోని సెయింట్ అల్ఫోన్స్ పాఠశాలలో ఏర్పాటు చేయనున్న కేంద్రాన్ని ఆమెబుధవారం పరిశీలించారు. ఈ నెల 3 నుంచి 8 వరకు అర్హులైన ఉద్యోగులందరూ పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఎండల తీవ్రంత అధికంగా ఉన్నందున పోలింగ్ కేంద్రంలో నీడ వసతి, తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. పోలింగ్ సందర్భంగా కేటగిరీ వైజ్‌గా పోస్టల్ బ్యాలెట్స్‌ను బండల్స్‌గా చుట్టాలని అధికారులకు సూచించారు. కౌంటింగ్ సమయంలో ఇబ్బందులు ఎదురుకాకుండా చూసుకోవాలన్నారు.కార్యక్రమంలో జడ్పీ సీఈవో శ్రీనివాస్, ఆర్డీవో కె మహేశ్వర్, పరిశ్రమల శాఖ జీఎం నవీన్ కుమార్, కరీంనగర్ రూరల్, అర్బన్‌తహసీల్దార్లునవీన్‌కుమార్, రమేష్ పాల్గొన్నారు.

● బ్యాలెట్ యూనిట్స్‌ను సిద్ధం చేయండి..

కరీంనగర్ పార్లమెంట్ స్థానం నుంచి 28 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని, ఇందుకు అవసరమైన బ్యాలెట్ యూనిట్స్‌ను సిద్ధం చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. బుధ వారం కరీంనగర్‌లోని ఈవీఎం గోదాంలో చేపట్టిన బ్యాలెట్ యూనిట్స్ చెకింగ్‌ను కలెక్టర్ పర్యవే క్షిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సి బ్బంది అప్రమత్తంగా బ్యాలెట్ యూనిట్స్‌ను తనిఖీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మికిరణ్, ఈవీఎంస్ నోడల్ ఆఫీసర్ కిరణ్ ప్రకాశ్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ శ్రీవాణి పాల్గొన్నారు.

ఎండలు బాబోయ్..



- అత్యధికంగా వీణవంకలో 46.2 డిగ్రీల ఉష్ణోగ్రత
- వడగాలులు.. ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి
- జిల్లా అంతటా ఆరెంజ్ అలర్ట్
- అల్లాడుతున్న జనం

కరీంనగర్ టౌన్, మే 1: సూర్యుడు నిప్పులు చెరుగుతున్నాడు. రోహిణికి ముందే రోకళ్ళు పగిలే ఎండలు మండిపోతున్నాయి. జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వారం రోజులుగా 45 డిగ్రీల పైన ఉష్ణోగ్రతలు నమోద వుతున్నాయి. బుధవారం జిల్లాలోని వీణవంకలో అత్యధికంగా 46.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైంది. జిల్లా అంతటా దాదాపు 45 డిగ్రీలపైన ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మే 1న ఈ పరిస్థితి ఇలా ఉంటే ఈ నెలాఖరు వరకు ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశాలుంటాయని ఆందోళన చెందుతున్నారు. మరో నాలుగైదు రోజులపాటు ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశాలున్నాయని, ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని వాతావరణశాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతు న్నారు. తెల్లవారడంతోనే సూర్యుడు తన ప్రతాపం చూపుతున్నాడు. ఎండ వేడిమిని భరించలేక ప్రజలు రోడ్లపైకి వచ్చేందుకు జంకుతున్నారు. బయట నిప్పులు చెరుగుతున్న సూర్యుడు... ఇంట్లో ఉంటే భరించలేని ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. దీంతో నిత్యం రద్దీగా ఉండే జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారులతోపాటు ముఖ్య కూడళ్ళు జనం లేక వెలవెలబోతున్నాయి. జంతువులు, పక్షులు, మూగ జీవాలు ఎండ వేడిమిని తట్టుకోలేక విల విలలా డుతున్నాయి. వృద్ధులు, చిన్నపిల్లలు, వ్యాధి గ్రస్తులు వేడిని భరించలేక నానా యాతనపడు తున్నారు. ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు కూడా పనిచేయడం లేదని, ఇంట్లో ఉండలేక పోతున్నామని, రాత్రి 11 గంటల వరకుకూడా వేడి గాలులు వీస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెక్కాడితేకానీ డొక్కాడని కూలీలు, ఆటోలు, రిక్షా కార్మికులు, వీధి వ్యాపారులు, చిరువ్యాపారులు బతుకుబండిని లాగేదెట్లా అంటూ ఆందోళన చెందుతున్నారు. ఎండల తీవ్రత గత ఏడాదితో పోల్చితే ఈ యేడు ఐదు డిగ్రీల వరకు ఉష్ణోగ్రత పెరిగినందున అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి ఉదయం 10 తర్వాత సాయంత్రం 6 గంటల వరకు రావద్దంటూ డాక్టర్లు సూచిస్తున్నారు. ఒకవేళ వచ్చినా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

60 ఏళ్లు మించిన వారిని ఎన్నికల విధుల నుంచి మినహాయించాలి

కరీంనగర్ టౌన్, మే 1: పార్లమెంట్ ఎన్నికల విధుల నుంచి 60 ఏళ్లు మించిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని టీపీయూఎస్ జిల్లాశాఖ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పమేలాసత్పతిని కోరారు. బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్‌ను తపస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కట్ట రాజేశ్వర్, అన్నమనేని తిరుపతిరావు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్న వారికి, గర్భిణులకు, చంటి పిల్లల తల్లులకు కూడా ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో తపస్ జిల్లా ఉపాధ్యక్షుడు జె శశిధర్‌రెడ్డి, కె హరిచరణ్, జిల్లా కోశాధికారి వినయధర్‌రాజు, జిల్లా కార్యదర్శి ఆర్ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

ఎన్నికలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయండి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్

కరీంనగర్, మే 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికలకు మరికొద్ది రోజులే గడువు ఉందని, అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ కలెక్టర్లను ఆదేశించారు. ఎన్నికల ఏర్పాట్లపై బుధవారం సాయంత్రం కలెక్టర్లతో హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోమ్ ఓటింగ్ ఈ నెల 3 నుంచి ప్రారంభమవుతుందని, ఈ నేపథ్యంలో కలెక్టర్లు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న పోలింగ్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది, ఉద్యోగులు అందరూ పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలని సూచించారు. ఎన్నికల నియమావళి పక్కాగా అమలయ్యేలా కృషి చేయాలని తెలిపారు. ఉల్లంఘన జరిగిన చోట కఠినంగా వ్యవహరించాలని సూచించారు. చెక్‌పోస్టుల వద్ద విస్తృతంగా తనిఖీలు చేపట్టాలన్నారు. ఫిర్యాదులపై వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికలకు అన్ని రకాలుగా సిద్ధంగా ఉన్నామని కలెక్టర్ పమేలా తెలిపారు. కరీంనగర్ నుంచి 28 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారని, ఈ మేరకు అవసరమైన బ్యాలెట్ యూనిట్స్ ను అందుబాటులో ఉంచుతున్నామన్నారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు కరీంనగర్‌లో ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. 2,194 పోలింగ్ స్టేషన్లలో అన్ని వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తున్నామని చెప్పారు. ఇంటింటికీ ఓటర్ స్లిప్పులు పంపిణీ చేస్తున్నామని, అందరికీ అందేలా చూస్తున్నామని, ఓటింగ్ శాతం గతంలో కంటే పెరిగేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, డీఆర్వో పవన్ కుమార్, జడ్పీ సీఈవో శ్రీనివాస్, పరిశ్రమల శాఖ జీఎం నవీన్‌కుమార్, డీఐవో శివరాములు పాల్గొన్నారు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్

ఎస్సారార్ విద్యార్థులకు జిజ్ఞాస బహుమతి

గణేశ్‌నగర్, మే 1: కరీంనగర్‌లోని ఎస్సారార్ ప్రభుత్వ విద్యార్థులు కళాశాల విద్యాశాఖ నిర్వహించిన జిజ్ఞాస విద్యార్థి అధ్యయన ప్రాజెక్టు రాష్ట్ర స్థాయి (హిందీ) పోటీల్లో మూడో స్థానంలో నిలిచారు. బుధవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో వారు 10 వేల నగదు బహుమతి, సర్టిఫికెట్లు అందుకున్నారు. హిందీ సహ ఆచార్యులు డాక్టర్ వి వర్రప్రసాద్ పర్యవేక్షణలో మొహమ్మద్ ముజుతబా, మొహమ్మద్ ఆసిఫ్, షేక్ షరీఫ్, సయ్యద్ ఖాజా మొయినుద్దీన్, సర్దార్ మన్‌ప్రీత్‌సింగ్ సోషల్ మీడియాలో హిందీ భాష: ఒక అధ్యయనం అంశంపై ప్రాజెక్టు రూపొందించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ టి రాజయ్య, స్టాఫ్ సెక్రె టరీ శ్రీనివాస్ విద్యార్థులను అభినందించారు.



జిజ్ఞాస రాష్ట్రస్థాయి బహుమతులు పొందిన ఎస్ఆర్ఆర్ విద్యార్థులు





ఎస్సారార్‌లో బేసిక్ బ్యూటీషియన్ కోర్స్ సర్టిఫికెట్ల ప్రదానం

గణేశ్‌నగర్, మే 1: ఎస్సారార్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో బుధవారం బేసిక్ బ్యూటీషియన్ కోర్స్ సర్టిఫికెట్ల ప్రధాన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా డాక్టర్ జయంతి అసోసియేట్ ప్రొఫెసర్ ప్రిన్సిపల్ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ శాతవాహన యూనివర్సిటీ ముఖ్య అతిథిగా విచ్చేసి సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. సౌందర్యం యొక్క ఆవశ్యకతను పరిగణలో ఉంచుకొని ఈ కోర్సులో వారు నేర్చుకున్నటువంటి అంశాలను సద్వినియోగపరచుకోవాలని విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె రామకృష్ణ కోర్సును ఉద్దేశించి గత 10 సంవత్సరాలుగా నిరంతరాయంగా సాగుతున్నటువంటి ఈ కోర్సు ఎంతో మందికి ఉపాధిని కల్పించిందని మీరు కూడా అదే దిశగా నడక సాగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆంగ్ల విభాగ అధిపతి శ్రీమతి ఉమా మహేశ్వరి మాట్లాడుతూ ఇంతటి గొప్ప విలువైన విద్యను నేర్పిన కళాశాలను విద్యార్థులను కోఆర్డినేటర్, రిసోర్స్‌పర్సన్ లీనాను కొనియాడారు. ఈ కార్యక్రమంలో భాగంగా బేసిక్ బ్యూటిషన్ కోర్స్ కోఆర్డినేటర్ డాక్టర్ మన్నే శోభారాణి మాట్లాడుతూ బేసిక్ బ్యూటీషియన్ కోర్సుకు సంబంధించిన ప్రతి విషయం గురించి మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల ఏవో కామ రాజు, లెక్చరర్స్ సోనియారెడ్డి, డాక్టర్ ప్రమీల,జూబ్లీ రెప్లిక, కోర్సు రిసోర్స్ పర్సన్ లీనా, కోర్సుకు సంబంధించిన విద్యార్థులు పాల్గొన్నారు.



బాలభవన్ శిక్షణ శిబిరానికి స్పందన



నృత్యంలో శిక్షణ పొందుతున్న చిన్నారులు

కరీంనగర్ కల్చరల్, మే 1: జిల్లా కలెక్టర్, విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రతి యేటా 5 నుంచి 16 సంవత్సరాల బాలబాలికలకు వేసవిలో నిర్వహించే శిక్షణా శిబిరం అంబేద్కర్ స్టేడియంలో జరుగుతోంది. శిబిరానికి చిన్నారుల నుంచి మంచి స్పందన వస్తోంది. చిత్రలేఖనం, పెన్సిల్ పేయింటింగ్స్, హాండ్ రైటింగ్, గాత్ర, కర్ణాటక సంగీతం, లలిత, దేశభక్తి గేయాలు, మృదం గం, తబల, కంజీర, జానపద, క్లాసికల్, సెమీ క్లాసికల్, వెస్టన్ నృత్యాలు, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ, మగ్గం, బ్యూటీషియన్, మెహం దీ కోర్సులతో పాటు అబాకస్, చెస్, శాస్త్రీయ నృత్యం, యోగాల్లోనూ శిక్షణ ఇస్తున్నారు. తల్లిదండ్రులు పిల్లలను శిక్షణకు పంపిస్తున్నారు. జూన్ 8వ తేదీ వరకు అంశాల వారీగా శిక్షణ ప్రతీరోజూ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నాం 12 గంటల వరకు కొనసాగనుంది. పాత, కొత్త విద్యార్థులు కలిపి ప్రస్తుతం (ఏప్రిల్ 30వ తేదీ వరకు) 330 మంది వివిధ అంశాల్లో శిక్షణ పొందుతున్నారని బాలభవన్ సూపరెండెంట్ కట్ట మంజులాదేవి తెలిపారు. బాలబాలికలు ఆధార్ కార్డ్, ఫొటోతో సంప్రదించాలని కోరారు. ఈ మాసంలో విద్యార్థుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అన్నా రు. శిక్షణకు సహకరిస్తున్న జిల్లా కలెక్టర్, డీఈఓ, విద్యార్థుల తల్లిదండ్రులు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా విద్యార్థులు, తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలని, వాటర్ బాటిల్స్, స్నాక్స్ తెచ్చుకోవాలని సూచించారు.

రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో జిల్లా క్రీడాకారులకు ఓవరాల్ చాంపియన్ షిప్



ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించిన కరీంనగర్ జిల్లా క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, మే1: ఖమ్మం జిల్లాలోని సర్దార్ పటేల్ ఇండోర్ స్టేడియంలో ఏప్రిల్ 28,29,30 తేదీలలో జరిగిన తెలంగాణ రాష్ట్ర స్థాయి టెబుల్ టెన్నిస్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు విశేష ప్రతిభ చాటి ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను సాధించారు. ఈ పోటీల్లో జిల్లాకు చెందిన జీఎస్ అకాడమీ క్రీడాకారులు పాల్గొని అద్భుత ప్రతిభ కనబరిచి క్యాడెట్ విభాగంలో చైత్ర కాంస్య పతకం, బాలికల విభాగంలో అవనిరెడ్డి, సత్య, సింధు, అనన్యలు రెండు బంగారు, రెండు వెండి, ఒక కాంస్య పతకాలను సాధించారు. అలాగే ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్‌లో అజయ్, అవని రెడ్డి, రజిత పతకాలను సాధించారు. బాలుర విభాగంలో అజయ్, రెండు రజిత, ఒక కాంస్య పతకాన్ని, పురుషుల డబుల్స్‌లో అజయ్, చన్మయ్ రజత పతకాలను సాధించి ఈ పోటీల్లో కరీంనగర్ జిల్లాకు ఓవరాల్ చాంపియన్ షిప్‌ను సాధించి పెట్టారని జీఎస్ అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ జి శరత్‌కుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సర్దార్ సురేందర్ సింగ్ తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులను జీఎస్ అకాడమీ ఉపాధ్యక్షుడు బి.శ్రీదర్ గౌడ్, బి మహేష్, యన్ మహిపాల్, సంయుక్త కార్యదర్శి వికాస్ కుమార్, కోశాధికారి గౌతంరెడ్డి, సభ్యులు రజనీకాంత్‌రెడ్డి, శ్రీకరచారి, సంతోష్, హర్ష అబినందించారు.







కోడలిని దారుణంగా హత్య చేసిన మామ



ఆకుల మౌనిక(ఫైల్)

సారంగాపూర్, మే1: మండలంలోని రేచపల్లి గ్రామంలో కోడలిని గొంతు కోసి మామ హత్యచేసిన ఘటన బుధవారం కలకలం రేపింది. ఈ హత్యకు సంబంధించిన వివరాలను రూరల్ సీఐ అరీఫ్ అలీఖాన్ వెల్లడించారు. రేచపల్లి గ్రామానికి చెందిన ఆకుల మౌనిక (25)ను కొత్తపల్లి లచ్చునాయక్ తండాకు చెందిన ఆకుల తిరుపతితో ఏడేళ్ల క్రితం వివాహం జరిగింది. తిరుపతి జీవనోపాధి నిమిత్తం న్యూజిలాండ్ వెళ్లాడు. ఈ నెల 27న ఇద్దరు వ్యక్తులు మౌనిక పట్ల అసభ్యంగా ప్రవర్తించి వేధింపులకు గురిచేశారు. దీంతో మౌనిక వేధింపులు తాళలేక స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మౌనిక ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదైంది. అయితే మౌనిక పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయడంతో తమ కుటుంబ పరువు పోయిందని మామ ఆకుల రాజిరెడ్డి కోడలిని మందలించాడు. ఇదే విషయమై ఆమెపై రాజిరెడ్డి కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలో మౌనిక ఇంట్లో నిద్రిస్తుండగా ఆరుబయట పడుకున్న మామ రాజిరెడ్డి పథకం ప్రకారం ఉదయం 5 గంటల సమయంలో కత్తితో మౌనిక గొంతు కోసి హత్య చేశాడు. దీంతో మౌనిక అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. తండ్రి తోట రాజయ్య ఫిర్యాదు మేరకు మామ రాజిరెడ్డి, అత్త గంగవ్వ, భర్త తిరుపతిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వడదెబ్బతో దివ్యాంగ బాలుడి మృతి

రామడుగు, మే 1: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన కళ్లెం యశ్వంత్ (5) అనే దివ్యాంగ బాలుడు బుధవారం వడదెబ్బతో మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. కళ్లెం అంజయ్య, పుష్ప దంపతుల కుమారుడు యశ్వంత్ పుట్టినప్పటి నుంచి అంగవైకల్యంతో బాధపడుతున్నాడు. బాలుడి కోసం దంపతులు పెద్ద ఎత్తున ఖర్చు చేశారు. అంత్యక్రియలు నిర్వహించడానికి ఇబ్బందిగా ఉన్న కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

మా ఆస్తులను అప్పగించే అధికారం లేదు

● కొండగట్టు అధికారులకు విన్నవించిన సిద్దిపేట జిల్లా వాసులు ● గతంలో 2.20 ఎకరాలు దానం చేస్తానని ప్రకటించిన భక్తుడు

మల్యాల, మే 1: మా ఆస్తులను కొండగట్టు ఆలయానికి దానం చేస్తానని ప్రకటించిన తమ తండ్రి మాటలను పరిగణలోకి తీసుకోవద్దని సిద్దిపేట జిల్లాకు చెందిన కుటుంబ సభ్యులు బుధవారం కొండగట్టుకు వచ్చి అధికారులకు విన్నవించారు. తన కొడుకు తనను సాకడం లేదని తన ఆస్తిని కొండగట్టు అంజనేయస్వామికి దానం చేయడానికి సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం అల్లీపూర్‌కు చెందిన కొప్పెర బాపురెడ్డి గత నెల 24న ఆలయానికి వచ్చాడు. ఆస్తి పత్రాలను హుండీలో వేయడానికి ప్రయత్నించాడు. గమనించిన అక్కడి సిబ్బంది అడ్డుకున్నారు. ఈ క్రమంలో అతని కుటుంబ సభ్యులు బుధవారం కొండగట్టుకు వచ్చి అధికారులను కలిసారు. ఆరోగ్య పరిస్థితి సరిగ్గా లేక తన భర్త తమ ఆస్తులను కొండగట్టు అంజనేయస్వామి దేవస్థానానికి దానం చేస్తానని తెలిపాడని బాపురెడ్డి భార్య లక్ష్మి, కుటుంబ సభ్యులు దేవస్థానం అధికారులకు తెలిపారు. ఈ మేరకు అతడి భార్య లక్ష్మి, కుమారుడు ప్రవీన్‌కుమార్, కూతుళ్లు మల్లీశ్వరి, స్వరూప ఈవో చంద్రశేఖర్‌కు భూదానంపై ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకోవద్దని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఆరోగ్య పరిస్థితి సరిగా లేని బాపురెడ్డి తమ కుటుంబ ఆస్తులను దానం చేస్తానని ఇటీవల కొండగట్టుకు వచ్చి ప్రచారం చేయడాన్ని పరిగణలోకి తీసుకోవద్దని కోరారు. తమ పూర్వీకుల నుంచి వస్తున్న ఆ ఆస్తులు తమకు మాత్రమే సంక్రమిస్తాయని అతడికి ఎలాంటి సంబంధం లేదని చెప్పారు. దీనిపై దేవస్థానం అధికారులు తమను సంప్రదించకుండా ఎలాంటి చర్యలు తీసుకోవద్దని కోరారు. బాపురెడ్డి 2.20 ఎకరాలకు సంబంధించిన పత్రాలు తదితరవి హుండీలో వేయాలని ప్రయత్నించాడు.



కొండగట్టు ఆలయ ఈవోకు వినతిపత్రం అందజేస్తున్న కటుంబ సభ్యులు

హుండీలలో వేస్తే ప్రయోజనం లేదని అధికారులు తెలుపగా దేవాలయం పక్కన రామాలయం నిర్మిస్తే ఆ భూమిని దానం చేస్తానని బాపురెడ్డి బాండ్‌పేపర్ రాసిచ్చాడు. పాసుపుస్తకం అందించగా దేవస్థానం అధికారులు రిజిస్ట్రేషన్ చేయాలని కోరారు. దీంతో కుటుంబసభ్యులు బుధవారం వచ్చి బాపురెడ్డి తమతో 15ఏళ్లుగా ఉండడం లేదని భూమి దానంకు సంబంధించి ఎలాంటి చర్యలు తీసుకోవద్దని కోరారు.

మంథని సబ్‌స్టేషన్‌లో ఫీడర్ బ్రేకర్ సిటీ బ్లాస్ట్



ఫీడర్ బ్రేకర్ వద్ద మంటలు

మంథని, మే 1: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 33/11 కేవీలో మండలంలోని కాకర్లపల్లి ఫీడర్ సిటీ బ్లాస్ట్ కావడంతో బుధవారం విద్యుత్ అంతరాయం ఏర్పడింది. ట్రాన్స్‌ఫార్మర్‌లో ఆయిల్ ఫైరింగ్ కావడంతో మంథని టౌన్‌తో పాటు కాకర్లపల్లి సూరయ్యపల్లి, గంగాపురి గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈ విషయంలో వెంటనే స్పందించిన పెద్దపల్లి ఎస్సీ బొంకూర్ సుదర్శన్ సబ్‌స్టేషన్ సందర్శించి మంథని డీఈ ఈశ్వర ప్రసాద్, ఏఈ చిన్నాల మల్లయ్యలతో పరిస్థితిని సమీక్షించారు. ఉదయం 10 గంటలకు బ్లాస్టింగ్ వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగగా ఎస్సీ యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయించి 11 గంటలకు సరఫరా చేశారు. ఫీడర్ బ్రేకర్ సిటీ బ్లాస్ట్ కావడంతో ఫైర్‌స్టేషన్ అధికారి సదానందం తమ సిబ్బందితో చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు.

చేపలు పట్టడంపై రెండు గ్రామాల మధ్య వివాదం

మల్యాల,మే1: మండలంలోని పోతారం చెరువులో చేపలు పట్టడంపై పోతారం, గొల్లపల్లి గ్రామ వాసుల మధ్య గత రెండు రోజులుగా వివాదం నెలకొంది. మంగళవారం పోతారం చెరువులో చేపలు పట్టగా పోతారానికి చెందిన కొందరు లాక్కెళ్లిన్నట్లు గొల్లపల్లికి చెందిన గంగపుత్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో బుధవారం పోతారానికి చెందిన వాల్మీకి భోయ సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోలీస్‌స్టేషన్‌కు తరలివచ్చారు. ఇరు గ్రామాల వాదనలు విన్న పోలీసులు మత్స్యశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించుకోవాల్సి ఉంటుందని తెలిపారు. వివాదంను అధికారులు పరిష్కరించాలని ఇరు గ్రామాల మధ్య గొడవలు లేకుండా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ దాడుల్లో గంజాయి పట్టివేత

కరీంనగర్ క్రైం, మే 1: కరీంనగర్ రూరల్ మండలం ఫకీర్‌పేట, చెర్ల బూత్కూర్ గ్రామాల్లో బుధవారం కరీంనగర్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిర్వహించిన దాడుల్లో 603 గ్రాముల నిషేధిత గంజాయి పట్టుబడింది. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ టీ డేవిడ్ రవికాంత్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ పి శ్రీనివాసరావుల ఆదేశాలు మేరకు జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ కే నాగేశ్వరరావు అధ్వర్యంలో రెండు గ్రామాల్లో దాడులు నిర్వహించి ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేయగా మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఫకీర్‌పేటకు చెందిన అడపా వంశీ, మనకొండూరు మండలం వేగురుపల్లికి చెందిన తప్పేట నితీష్‌కుమార్‌లను అరెస్టు చేయగా కరీంనగర్ కాశ్మీర్ గడ్డకు చెందిన ఎండీ ఉమర్ అలియాస్ నోమన్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. పట్టుబడిన వారి వద్దనుంచి 603 గ్రాముల గంజాయి, ద్విచక్రవాహనం, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీన పర్చుకున్నట్లు తెలిపారు. చర్లభుత్కూర్ గ్రామంలో గంజాయి సేవిస్తూ పట్టుబడ్డ ఐదుగురు వ్యక్తులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసేందుకు కరీంనగర్ రూరల్ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించామని తెలిపారు. ఈ దాడులలో హెడ్‌కానిస్టేబుల్ మోసిన్, కానిస్టేబుళ్లు కుమార్ యాదవ్, ఖాసింబి, కమలాకర్, వర్మ, జీవన్, ట్రైనీ కానిస్టేబులు పాల్గొన్నారు.



నిందితులను అరెస్టు చూపుతున్న ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ నాగేశ్వరరావు

కాంగ్రెస్ అంటేనే స్కాముల పార్టీ

భగత్‌నగర్, మే 1: కాంగ్రెస్ పార్టీ అంటేనే స్కాముల పార్టీ అని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమదేవి విమర్శించారు. బుధవారం నగరంలోని ఎంపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ 2జీ, సహారా, బొగ్గు, ఈఎస్ఐ స్కాంలతో దేశాన్ని భ్రష్టుపట్టించిన పార్టీ కాంగ్రెస్ అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ పెద్ద అవినీతిపరుడని ఆరోపించారు. ఓ ట్రావెల్స్ అధినేత నుంచి కోటిన్నర విలువైన కారు, ఎన్టీపీసీ బూడిద తీసుకెళ్లే లారీలను ఆపి కాంట్రాక్టర్‌ను బెదిరించి మొదట రెండు కోట్లు, ఆ తర్వాత 6 కోట్లు వసూలు చేసింది నిజం కాదా అని ప్రశ్నించారు. మంత్రితో పాటు బీఆర్ఎస్, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఇద్దరు కాంట్రాక్టర్‌ను బెదిరించి డబ్బులు వసూలు చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ఎంపీ టికెట్ ఇచ్చినందుకు వెలిచాల రాజేందర్‌రావు వద్ద కోట్లాది రూపాయలు డబ్బులు వసూలు చేసింది నిజం కాదా అని ప్రశ్నించారు. మంత్రి పొన్నం అవినీతి, వ్యవహార శైలి చూస్తుంటే కాంగ్రెస్ నేతలే అసహ్యించు కుంటున్నారన్నారు. నాటి మంత్రి గంగులతో లాలూచీ పడి 5 కోట్లు తీసుకుని హుస్నాబాద్‌కు పారిపోయాడన్నారు. జర్నలిస్టులకు బీపీఎల్ కోటా కింద ఇచ్చిన భూములపై కన్నేసి లేని వివాదాన్ని సృష్టించిన మాట నిజం కాదా అన్నారు. బూడిద స్కాంపై అవసరమైతే సీబీఐకి లేఖ రాస్తామన్నారు. రిజర్వేషన్లపై ఫేక్ వీడియోలు సృష్టించి ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్న నీచమైన పార్టీ కాంగ్రెస్‌పార్టీ అన్నారు. ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్‌కుమార్ మాట్లాడుతూ 54 సంవత్సరాలు దేశాన్ని పాలించిన కాంగ్రెస్ రిజర్వేషన్లకు తూట్లు పొడి చిందన్నారు. మోదీ ప్రధాని అయ్యాక గ్రామాలకు కరెంట్ సౌకర్యం కల్పించ డంతో పాటు అభివృద్ధి పనులు చేపట్టారన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ

చెరువులో పడి ఒకరి మృతి

గంగాధర, మే 1: గంగాధర మండలం గట్టుబూత్కూర్ చెరువులో పడి ఒకరు మృతి చెందినట్లు ఎస్ఐ కిరణ్‌రెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం కొత్తపల్లి మండలం రేకుర్తికి చెందిన తూర్పటి మైసయ్య(27), అతని బావ పత్తి ముత్యాలు ఇద్దరు గంగాధర మండలం గట్టుబూత్కూర్ చెరువులో చేపలు పట్టేందుకు బుధవారం వెల్లారు. ఇద్దరు చెరువు కట్టపై మద్యం సేవించిన అనంతర తూర్పటి మైసయ్య చేపల కోసం చెరువులోకి దిగాడు. మద్యం మత్తులో చెరువులోకి దిగి ఊపిరాడక మృతి చెందాడు. మృతుడి చెల్లె గంగ పిర్యాధుమేరకు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

డివైడర్‌పైకి దూసుకెళ్లిన కారు

● తప్పిన ప్రమాదం

సుల్తానాబాద్, మే 1: ఓ కుటుంబం కారులో దైవదర్శనానికి వెళ్లివస్తుండగా కారు అదుపు తప్పి డివైడర్‌పైకి దూసుకెళ్లింది. సింగరేణి అండ్రియాల ప్రాజెక్టులో పని చేస్తున్న ఓ కార్మికుడి కుటుంబం మొక్కు చెల్లించడానికి ఏప్రిల్ 27 తిరుమలకు కారులో వెళ్లారు. తిరిగి వస్తుండగా సుల్తానాబాద్ పట్టణంలో రాజీవ్ రహదారి వద్ద ఐబీ చౌరస్తా దాటిన తర్వాత మూలమలుపు వద్ద కారు అదుపుతప్పి డివైడర్ పైకి దూసుకెళ్లింది. కారు ముందు టైర్ పేలిపోవడంతో అందులో ప్రయాణిస్తున్న కొందరికి స్వల్పగాయాలయ్యాయి. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని కారును పక్కకు తీయించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. రాజీవ్ రహదారిపై ఘటన జరుగడంతో కారులో ఉన్న వారు భయాందోళనకు గురయ్యారు.

అక్కాచెల్లెళ్ల అదృశ్యం

మల్యాల,మే 1: మండలంలోని ఓబులాపూర్‌కు చెందిన అక్కాచెల్లెళ్లు అదృశ్యమైనట్లు ఎస్సై అబ్దుల్ రహీం తెలిపారు. ఓబులాపూర్‌కు చెందిన బొజ్జ బాబు భార్య లక్ష్మి గత 25 రోజుల క్రితం మృతి చెందగా కూతుళ్లు వైష్ణవి(17), ప్రసన్న(15)లతో బాబు ఉంటున్నాడు. మంగళవారం రాత్రి మేడపైన ముగ్గురు పడుకోగా బాత్రూంకు వెళ్లి వస్తామని చెప్పి కిందకు దిగిన అక్కాచెల్లెళ్లు ఇంటి నుంచి వెళ్లిపోయారు. తిరిగి రాకపోవడంతో తండ్రి చుట్టుపక్కల ఇళ్లు, పలు చోట్ల వెతికాడు. ఆచూకీ లభించకపోవ డంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాలికల తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

తంగళ్లపల్లి, మే 1: ప్రేమ విఫలం అవడంతో పాటు అనారోగ్య సమస్యలతో బీహార్ రాష్ట్రానికి చెందిన ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, యువకుడి బంధువుల కథనం ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన ఎండీ సజన్ (23) గత కొంతకాలంగా తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి శివారులోని పెట్రోల్ బంక్ పక్కన తాత్కలిక రేకుల షెడ్డు ఏర్పాటు చేసుకుని పంక్చర్ షాపు నిర్వహిస్తున్నాడు. గతంలో ఓ అమ్మాయి ప్రేమలో పడగా అది విఫలం అవడంతో ఆత్మహత్య ప్రయత్నం చేయగా కుటుంబ సభ్యు లు అడ్డుకుని కౌన్సిలింగ్ నిర్వహించారు. అప్పటి నుంచి మనోవేద నకు గురవడంతో పాటు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. దీంతోతీవ్ర మనస్థాపానికి గురై పంక్చర్ నిర్వహించే షెడ్డులో ఉరివేసుకోని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం ఉదయం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నారు. మృతుని సమీప బంధువులు పెద్దూర్ గ్రామానికి చెందిన సమీర్ పోలీసులకు మృతుని వివరాలను, ఆత్మహత్యకు గల కారణాలను వెల్లడించారు.

ఇంట్లోకి దూసుకెళ్లిన లారీ

మల్యాల, మే 1: కరీంనగర్-జగిత్యాల మార్గంలోని రాజారం ఎస్సారెస్పీ కెనాల్ వద్ద ఓ లారీ ఇంట్లోకి దూసుకెళ్లింది. కరీంనగర్ వైపు నుంచి జగిత్యాల వస్తున్న లారీ అదుపుతప్పి రహదారి పక్కన గల బక్కశెట్టి పెద్ద గంగారాం అనే వ్యక్తి ఇంట్లోకి దూసుకెళ్లింది. దీంతో తృటిలో పెద్ద ప్రమాదం తప్పగా ఇంటి ముందు భాగం పూర్తిగా దెబ్బతిన్నది.

పంట పొలాల్లో చెలరేగిన మంటలు



మండలను ఆర్పుతున్న రైతులు, పోలీసులు

సుల్తానాబాద్ మే 1: ధాన్యం లోడ్‌తో వస్తున్న ఓ లారీ తాకడంతో విద్యుత్ వైర్లు తెగి పంటపొలాల్లో పడ్డాయి. దీంతో మంటలు వ్యాపించి పంట పొలాలు అగ్నికి ఆహుతయ్యాయి. కదంబాపూర్ నుంచి ధాన్యం బస్తాల లోడ్‌తో రైల్వే ట్రాక్ వెంట వస్తున్న ఓ లారీకి పైన ఉన్న విద్యుత్ తీగలు తగిలాయి. దాంతో తీగలు పొలాలపై పడిపోయి మంటలు అంటుకున్నాయి. దాదాపు పది ఎకరాల్లో మంటలు అంటుకుని లక్ష రూపాయల వరకు నష్టం కలిగినట్లు రైతులు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు రైతులతో కలిసి మంటలను ఆర్పడంలో సహకరించారు. పెద్దపల్లి నుంచి వచ్చిన ఫైరింజన్ మొరాయించడంతో సిబ్బంది కూడా పోలీసులు, రైతులతో కలిసి మంటలను అదుపులోకి తెచ్చారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య



రంగు తిరుపతి (ఫైల్)

ఇల్లందకుంట, మే 1: మండల కేంద్రానికి చెందిన రంగు తిరుపతి (45) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం ఇల్లందకుంట గ్రామానికి చెందిన రంగు తిరుపతి, కవిత దంపతులకు ఇరువురు సంతానం ఉన్నారు. ఇరువురి మధ్య తరుచూ గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో మానసికంగా కుంగిపోయిన తిరుపతి మధ్యాహ్నం పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండడంతో హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కూతురు రంగు కీర్తన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజకుమార్ పేర్కొన్నారు.

బీఎస్సీ ఆనర్స్ రెండో సెమిస్టర్ పరీక్ష రుసుం గడువు 7 వరకు

గణేశ్‌నగర్,మే1: ఎస్‌యూ పరిధిలోని బీఎస్సీ ఆనర్స్ రెండో సెమిస్టర్ విద్యార్థులకు పరీక్ష రుసుం చెల్లించడానికి ఎలాంటి అపరాధ రుసుం లేకుండా 7వ తేదీ వరకు తుది గడువు అని, 300/- ల అపరాధ రుసుంతో 10వ తేదీ వరకు చెల్లించాలని ఎస్‌యూ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎస్ వి శ్రీ రంగప్రసాద్ తెలిపారు. ఈ పరీక్షలను జూన్‌లో నిర్వహించనున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడి మృతి

మెట్‌పల్లి, మే 1: పట్టణంలోని భారత్ పెట్రోల్ బంక్ సమీపంలో బుధవారం గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో భూక్య భూమయ్య(55) అనే వృద్ధుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇబ్రహీంపట్నం మండలంలోని డబ్బా గ్రామానికి చెందిన భూక్య భూమయ్య పనుల నిమిత్తం మెట్‌పల్లికి వచ్చాడు. పట్టణంలోని భారత్ పెట్రోల్ బంక్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో భూమయ్యకు తీవ్ర గాయాలయ్యాయి.

స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం వైద్యుల సూచనల మేరకు నిజామాబాద్ ఆసపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి భూమయ్య మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

ఎస్సెస్సీలో మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థుల ప్రతిభ

కరీంనగర్ రూరల్, మే1: కరీంనగర్ రూరల్ మండలం ఇరుకుల్ల గ్రామంలోని తెలంగాణ మైనారిటీ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని పాఠశాల ప్రిన్సిపల్ నాజీయా ఫాతిమా తెలిపారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు యండి తౌషు 9.7, సాత్విక్ 9.7, పి తులసీరాం నాయక్ 9.5, ఎస్‌కె అనాస్ మాలిక్ 9.5 జీపీఎలు సాధించారని, యండి జైద్, హైమద్, మరో ముగ్గురు అత్యుత్తమ మార్కులు సాధించడమే కాకుండా మొత్తంగా 98శాతం సాధించారని ప్రిన్సిపాల్ అభినందించారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన 'సువిద్య' విద్యార్థులు



ప్రతిభ చూపిన విద్యార్థులతో కరస్పాండెంట్ మట్టతిల్‌బాబు, ప్రిన్సిపాల్ మధుకుమార్

కరీంనగర్ టౌన్, మే 1: ప్రణాళికాబద్ధంగా విద్యాబోధన చేయడంతో పదోతరగతి ఫలితాల్లో సువిద్య పాఠశాల విద్యార్థులు అద్భుత ఫలితాలను సాధించారని పాఠశాల కరస్పాండెంట్ మట్టతిల్‌బాబు, ప్రిన్సిపాల్ మధుకుమార్, అకాడమిక్ ఇంచార్జి శేష తెలిపారు. పరీక్షలు రాసిన 19 మంది విద్యార్థుల్లో ముగ్గురికి 10జీపీఏ, మరో ముగ్గురికి 9.8 జీపీఏ, ఇద్దరికి 9.5 జీపీఏతో పాటు మిగిలిన విద్యార్థులు మంచి మార్కులు సాధించారని అన్నారు. జిల్లాలోనే అత్యధికంగా 16శాతం 10 జీపీఏను తమ విద్యార్థులు సాధించడం గొప్ప విశేషమని అన్నారు.

ట్రినిటి పూర్వ విద్యార్థి, సివిల్స్ ర్యాంకర్‌కు సన్మానం



సాయికిరణ్‌ను సన్మానిస్తున్న ట్రినిటి వ్యవస్థాపక చైర్మన్ దాసరి మనోహర్‌రెడ్డి

కరీంనగర్ టౌన్, మే1: సివిల్స్ ఫలితాల్లో ట్రినిటి జూనియర్ కళాశాలలో 2012-14 విద్యాసంవత్సరంలో చదివిన నందాల సాయికిరణ్ ఆల్‌ఇండియా 27వ ర్యాంకు సాధించడం పట్ల ట్రినిటి యాజమాన్యం ఆయనను బుధవారం సన్మానించింది. బుధవారం స్థానిక ట్రినిటి జూనియర్ కళాశాల మెయిన్ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి వ్యవస్థాపక చైర్మన్, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సాయికిరణ్ లక్ష్యసాధన కోసం ప్రణాళికాబద్ధంగా ప్రిపేర్ అయి సివిల్స్ సాధించడం అభినందనీయమని అన్నారు. ట్రినిటి కళాశాలల అధ్యాపకులు సాయికిరణ్‌ను అభినందించారు.

'బీఆర్‌ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్‌ను గెలిపించాలి'

కరీంనగర్ టౌన్, మే 1: బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు నగర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బుధవారం పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా నగరంలోని వివిధ డివిజన్లలోని ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేశారు. 37వ డివిజన్‌లో డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి హరిశంకర్‌తో పాటు డివిజన్లలో కార్పొరేటర్లు, ఇంటింటి ప్రచారం నిర్వహించి కరపత్రాలను పంపిణీ చేశారు.

●కరీంనగర్ రూరల్: మండలంలోని దుర్శేడ్‌లో మాజీ ఉప సర్పంచ్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు సుంకిశాల సంపత్‌రావు ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్‌ను గెలిపించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మహేష్‌గౌడ్, కరుణాకర్, గట్టయ్య, అనిల్ రాజు పాల్గొన్నారు.

'సీఎంపై కేసు నమోదు చేయాలి'

కరీంనగర్ టౌన్, మే1: సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో ఒట్టు పెట్టుకోవడం నిబంధనలను ఉల్లంఘించడమేనని, ఆయనపై కేసు నమోదు చేయాలని రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్ అన్నారు. జమ్మికుంట బహిరంగ సభలో వేములవాడ రాజన్నపై ఒట్టు పెట్టుకొని ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించారని, దీన్ని కేంద్ర ఎన్నికల కమిషన్ సుమోటోగా తీసుకోవాలని డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీలు కుమ్మక్కై కరీంనగర్, మల్కాజిగిరితోపాటు మరికొన్ని చోట్ల కాంగ్రెస్ పార్టీ డమ్మీ అభ్యర్థులను బరిలో నిలిపిందని విమర్శించారు. ఈ మీడియా సమావేశంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు గుంజపడుగు హరిప్రసాద్, కెమసారం తిరుపతి, పూదరి రాజేశ్వరీగౌడ్, తుల బాస్కర్‌రావు, జయంత్ తదితరులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించండి

● ఎమ్మెల్యే కవ్వంపల్లిని వేడుకున్న ఉపాధిహామీ కూలీలు

గన్నేరువరం, మే 1: మా మండలానికి బస్సు సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను గన్నేరువరం మహిళలు కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం మండల కేంద్రంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఉపాధిహామీ కూలీలను కలిసి వారితో ముచ్చటించారు. కరీంనగర్ నుంచి గుండ్లపల్లి మీదుగా బస్సు సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నామని వెంటనే బస్సు సౌకర్యం కల్పించాలని మహిళలు కోరారు. మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కరిస్తామని ఎమ్మెల్యే మహిళలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి, నాయకులు అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి, కొమ్మెర రవిందర్‌రెడ్డి, అనంతరెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు చింతల శ్రీధర్‌రెడ్డి, మాతంగి అనిల్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు పని కల్పించాలి

గంగాధర, మే 1: ఉపాధి హామీ కూలీలకు చేతినిండా పని కల్పించాలని ఎంపీవో జనార్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం గంగాధర మండలం లక్ష్మీదేవిపల్లిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వేసవి దృష్ట్యా మండలంలో జరుగుతున్న ఉపాధి పని ప్రదేశంలో కూలీలకు తాగునీరు, నీడ సౌకర్యం కల్పించాలని అన్నారు. ఈ సందర్భంగా నర్సరీ, స్మశాన వాటిక, సెగ్రిగేషన్ షెడ్డు పనులను పరిశీలించారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట కార్యదర్శి కొత్తకొండ అంజయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ గంగాధర అంజయ్యలు ఉన్నారు.

హుజూరాబాద్ వాసికి డాక్టరేట్


స్వరూపరాణి

హుజూరాబాద్, మే 1: హుజూరాబాద్ పట్టణానికి చెందిన వకుళాభరణం స్వరూపరాణి జంతుశాస్త్ర విభాగంలో డాక్టరేట్ సాధించారు. స్వరూపరాణి జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. వకుళాభరణం స్వరూపరాణి సమర్పించిన పరిశోధన వ్యాసం 'హైడ్రో బయోలాజికల్ స్టడీస్ అండ్ సర్వే ఆఫ్ ఏ విఫానా అండ్ ఇక్తియోఫానా ఆఫ్ లోయర్ మానేర్ డామ్, కరీంనగర్ డిస్ట్రిక్ట్, తెలంగాణ స్టేట్' అనే అంశంపై యూనివర్సిటీ ప్రొఫెసర్ టి రవీందర్‌రెడ్డి పర్యవేక్షణలో 2024 జనవరి థీసిస్ సమర్పించారు. ఇందుకు ఏప్రిల్ 25న డాక్టరేట్ (పీహెచ్‌డీ) లభించింది. వకుళాభరణం స్వరూపరాణి డాక్టరేట్ అందుకున్న సందర్భంగా జంతుశాస్త్ర ప్రొఫెసర్స్, కుటుంబ సభ్యులు, మిత్రులు, కళాశాల అధ్యాపకులు అభినందించారు.

బీసీల సమస్యలను పరిష్కరించే అభ్యర్థికే మద్దతు

గణేశ్‌నగర్, మే 1: బీసీల సమస్యల పరిష్కారానికి కృషి చేసే అభ్యర్థికే పార్లమెంట్ ఎన్నికల్లో మద్దతు ఇస్తామని బీసీ సంఘాల జేఏసీ నాయకులు తెలిపారు. బుధవారం కరీంనగర్‌లోని ఒక హోటల్లో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వివిధ బీసీ సంఘాల నాయకుల సమావేశంలో బీసీ సంఘాల జేఏసీ సీనియర్ నాయకుడు కేశిపెద్ది శ్రీధర్ రాజు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఓబీసీల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

ప్రిసైడింగ్ ఆఫీసర్ల శిక్షణలో ఇబ్బందులు

గంగాధర, మే 1: గంగాధరలో నిర్వహిస్తున్న ఎన్నికల ప్రిసైడింగ్ ఆఫీసర్ల శిక్షణలో ఇబ్బందులు ఎదురయ్యాయి. బుధవారం రెండవ విడత ఎన్నికల ప్రిసైడింగ్ అధికారులకు రెండు రోజుల శిక్షణ గంగాధర ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా 450 మందికి శిక్షణ ఇస్తున్నారు.ప్రభుత్వ పాఠశాలలో షార్ట్ సర్క్యూట్‌తో విద్యుత్ నిలిచిపోయింది. ఇక భోజనాలు సరిపోలేదని, కనీసం తాగడానికి సరిపడా నీరు అందించలేదని శిక్షణకు వచ్చిన అధికారులు ఆవేదన వ్యక్తం చేశారు. శిక్షణ శిబిరానికి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న చొప్పదండి తహసీల్దార్ నరేందర్‌ని వివరణ కోరగా భోజనాలు అందని వారికి మరిన్ని తెప్పించామని,షార్ట్ సర్క్యూట్ కాగా మరమ్మతులు చేయించామన్నారు.

కార్మిక చట్టాలను మారిస్తే ఊరుకోం

-సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి-జిల్లాలో ఘనంగా కార్మిక దినోత్సవం



ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరిస్తున్న చాడ వెంకట్‌రెడ్డి

కరీంనగర్ రూరల్, మే1: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను మారిస్తే చూస్తూ ఊరుకోబోమని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ శాసనసభ్యులు చాడవెంకటరెడ్డి అన్నారు. బుధవారం కరీంనగర్ రూరల్ మండలం చామనపల్లి గ్రామంలో నిర్వహించిన మేడే వేడుకల్లో స్థానిక హమాలీ సంఘం నాయకులు ఏర్పాటు చేసిన ఏఐటీ యూసీ జెండాను ఆయన ఎగురవేశారు. కార్యక్ర మంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి, నియోజకవర్గ కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు పైడిపల్లి రాజు, హమాలీ సంఘం నాయకులు మెరుగు కొమురయ్య, రాములు, పెరుమల్ల శ్రీనివాస్, దొమ్మటి నాంపల్లి, తిరుపతి, గంట అంజయ్య శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

●భగత్‌నగర్: పది సంవత్సరాల బీజేపీ పాలనలో దేశం వంద సంవత్సరాలు వెనక్కి వెళ్లిందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం మేడేను పురస్కరించుకుని నగరంలోని తీగలగుట్టపల్లి వద్ద హమాలీ కార్మికులు ఏర్పాటు చేసిన ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి, కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, రైల్వే గూడ్స్ హమాలీ సంఘం నాయకుడు కాశెట్టి లక్ష్మయ్య గండ్ల రమేష్, దాసరి ప్రభాకర్, గండు మహేందర్, అయితం రఘుపతి, జెట్టి రాజు, బొడ్డు శంకరయ్య, గాండ్ల రవీందర్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, పైడిపల్లి రాజు, బూడిద సదాశివ, తదితరులు పాల్గొన్నారు.

●నగరంలోని సీపీఎం కార్యాలయం ముకుందలాల్ మిశ్రా భవన్‌లో సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించారు.

●నగరంలోని కూరగాయల మార్కెట్‌లో హమాలీ, ఐఎంఎల్ డిపో బేవరేజ్ హమాలీ కార్మికులు, పవర్‌లూం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సీఐటీయూ జెండాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు గుడికందుల సత్యం, దాడి నర్సయ్య, నవీన్, గట్టయ్య, సుధాకర్, భూమయ్య, మొగిలి కనుకయ్య, జి సతీష్ పాల్గొన్నారు.

●గాంధీరోడ్‌లో ట్రాన్స్‌పోర్ట్ హమాలీలు ఏర్పాటు చేసిన జెండాను సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా చాడ వెంకటరెడ్డి హాజరయ్యారు.

●కొత్తపల్లి మండలం బావుపేట జిల్లా గ్రానైట్ ఇండస్ట్రీస్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) బావుపేట ఆఫీస్ వద్ద సీనియర్ నాయకుడు రాజేశం జెండాను ఆవిష్కరించారు.

●కరీంనగర్ టౌన్: ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి కే.వెంకటేశ్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ వర్కింగ్ ఉమెన్ వసతి గృహంలో చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కే వెంకటేష్ తో పాటు, లీగల్ ఏడ్ డిఫెన్స్ కౌన్సిల్ తణుకు మహేష్, మహిళలు పాల్గొన్నారు.

●హుజూరాబాద్: పట్టణంలోని పోస్టాఫీస్, ఆర్టీసీ, మున్సిపల్, ఎల్ఐసీ, హమాలీ కార్మికులు, సీఐటీయూ నాయకులు జెండాను ఎగరవేశారు. కార్యక్రమంలో కార్మికులు, నాయకులు పాల్గొన్నారు.

● శంకరపట్నం: మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో మే డే వేడుకలను నిర్వహించారు. ఆయా సంఘాల బాధ్యులు జెండా ఆవిష్కరించారు.

●వీణవంక: మండల కేంద్రంతో పాటు నర్సింగాపూర్, వల్భాపూర్, చల్లూరు, ఎల్బాక, మామిడాలపల్లిల్లో మేడే సందర్భంగా సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పిల్లి రవియాదవ్, కార్మికులు పాల్గొన్నారు.

●ఇల్లందకుంట: మండల కేంద్రంతో పాటు మల్యాల, వంతడుపుల గ్రామాల్లో మే డే వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో చెల్పూరి రాము, జమ్మికం వెంకన్న, రావుల ఎల్లయ్య, గురుకుల రాజేందర్, స్వామి, ఓదెలు, రాజేందర్ పాల్గొన్నారు.

●రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట్, గుండి, రామడుగు, చిప్పకుర్తి, దేశ్‌రాజ్‌పల్లి గ్రామాలలో జెండా ఎగురవేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు కొయ్యెడ సృజన్‌కుమార్, మండల నాయకులు తిరుపతి, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మచ్చ రమేశ్ పాల్గొన్నారు.

●తిమ్మాపూర్: తిమ్మాపూర్, మొగిలిపాలెం, పర్లపల్లి, పోలంపల్లి, నల్లగొండ, మక్తపల్లి, మల్లాపూర్, ఇంద్రనగర్, రామకృష్ణకాలనీలో సీపీఐ ఆధ్వర్యంలో జెండా ఎగరవేశారు. కార్యక్రమంలో సీపీఐ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి పాల్గొన్నారు. పోరండ్లలో సీపీఎం ఆధ్వర్యంలో మేడే వేడుకలు నిర్వహించారు. వేరువేరుగా జరిగిన కార్యక్రమాలలో సీపీఎం నాయకులు సుంకరి సంపత్, సీపీఐ నాయకులు బోయిని తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

●చిగురుమామిడి: మండలంలోని అన్ని గ్రామాల్లో హమాలీ కార్మికులు, తాపీ కార్మికులు జెండాలను ఆవిష్కరించారు. మండల కేంద్రంలో సీపీఐ కార్యాలయంలో మేడే ఉత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మరెడ్డి, జడ్పీటీసీ గీకురు రవీందర్ పాల్గొన్నారు.

●గంగాధర: గంగాధర ప్రధాన కూడలి, గర్శకుర్తి, ఆచంపల్లి, గట్టుబూత్కూర్, ఒద్యారం, సర్వారెడ్డిపల్లి గ్రానైట్ క్వారీల్లో కార్మిక జెండాను ఎగురవేశారు.

●మానకొండూర్: మానకొండూర్, సదాశివపల్లి, అన్నారం, కొండపల్కల, గంగిపల్లి, గట్టుదుద్దెనపల్లి, పచ్చునూర్, చెంజర్ల, కెల్లేడు, వెల్ది, ఊటూర్ తదితర గ్రామాలలో కార్మికులు మేడే వేడుకలను నిర్వహించారు.

●సైదాపూర్: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో కార్మికులు మే డే వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలో జడల రాజేశం ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బత్తుల బాబు హాజరై జెండా ఆవిష్కరించారు.

కరాటేలో క్రీడాకారిణికి పతకాలు


పతకాన్ని అందుకుంటున్న పావని

కరీంనగర్ స్పోర్ట్స్, మే1: కేరళ రాష్ట్రంలోని క్యాలికట్‌లో మార్చి30న జరిగిన జాతీయస్థాయి ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లాకు చెందిన సీఎస్‌కేఐ క్రీడాకారిణి కాశెట్టి పావని రెండు బంగారు పతకాలను సాధించింది. జిల్లాకు చెందిన కంటినెంటల్ షోటోకాన్ కరాటే డో ఇండియా జాతీయ అకాడమీ నుంచి ఈ పోటీల్లో పాల్గొన్న ఆమె జూనియర్ 50 కిలోల విభాగంలో కటా, కుమిటీలలో రెండు బంగారు పతకాలను సాధించిందని సీఎస్‌కేఐ ఇండియా చీఫ్, కరాటే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈ.శ్రీనివాస్ తెలిపారు. 18రాష్ట్రాల నుంచి 1100 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటారని పేర్కొన్నారు. పతకాలు సాధించిన పావనిని సీఎస్‌కేఐ చైర్మన్ చల్ల హరిశంకర్, కార్యదర్శి మడుగుల ప్రవీణ్, కోశాధికారి వంగల శ్రీదర్, ఉపాధ్యక్షుడు పెద్ది సందీప్ తదితరులు అభినందించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న శ్రీవిద్యాభారతి పాఠశాల విద్యార్థులు

గణేశ్‌నగర్, మే 1: కరీంనగర్ కిసాన్ నగర్ లోని శ్రీవిద్యా భారతి ఉన్నత పాఠశాల 2004-05 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు బుధవారం పట్టణంలోని మైత్రి హోటల్‌లో ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గురువులను సన్మానించారు.

●సుభాష్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1998-99 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురువులు మల్లేశం సూర్యప్రకాష్ దత్తాత్రేయ మాధవి లత లక్ష్మణ్ మూర్తి లక్ష్మణ్ రేఖ, మంగాదేవి, శంకరయ్య తదితర ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జి కుమార్ కృపారాణి కుమారస్వామి అన్నపూర్ణ సంపత్ కుమార్ పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

కరీంనగర్ లీగల్, మే 1: జ్యుడీషియల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా వట్టుపల్లి రవి శంకర్‌రావు, ఉపాధ్యక్షుడిగా కె.నాగరాజం, కార్యదర్శిగా ఎం.ఎ.రషీద్, కోశాధికారిగా ఎం.ఎ.గఫార్ ఫారుఖీ, సంయుక్త కార్యదర్శులుగా హెచ్.రాజయ్య, తిరుపతిరెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శులుగా ఎ.విద్యాసాగర్, రాంగోపాల్ ఎన్నికైనట్లు ఎన్ని కల అధికారి ఎల్.రాజయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

హాకీ సమ్మర్ కోచింగ్ క్యాంపు ప్రారంభం

హుజూరాబాద్, మే 1: హుజూరాబాద్ పట్టణంలోని హైస్కూల్ మైదానంలో హాకీ సమ్మర్ కోచింగ్ క్యాంపును జిల్లా హాకీ ఉపాధ్యక్షుడు బండ శ్రీనివాస్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 1 నుంచి 31వ తేదీ వరకు హాకీ కోచింగ్ క్యాంపు నిర్వహిస్తామన్నారు. ఈ హాకీ సమ్మర్ కోచింగ్ క్యాంపును క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కొలిపాక శ్రీనివాస్, ఉమామహేశ్వర్, వర్థినేని రవీందర్‌రావు, శ్రీనివాస్, రమేష్, తిరుపతి, శంకర్, శ్యాంసుందర్, రాజిరెడ్డి, వినయ్, రాజ్‌కుమార్, రాజు, వంశీ, విపుల్, పవన్ తదితరులు పాల్గొన్నారు.


కోచింగ్ క్యాంపును ప్రారంభిస్తున్న బండ శ్రీనివాస్

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి


సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సారబుడ్ల ప్రభాకర్‌రెడ్డి

సైదాపూర్, మే 1: వేసవిని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని, అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ సారబుడ్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం సైదాపూర్ మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంతో పాటు గ్రామాలను అన్ని విధాలా అభివృద్ధి చేయాలన్నారు. వేసవికాలం దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుధ్యంపై ఎప్పటికప్పుడు దృష్టి సారించాలని సూచించారు.

అన్ని శాఖల అధికారులు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తమ విధులు సక్రమంగా నిర్వర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో యాదగిరి, ఎంపీటీసీలు, ప్రత్యేకాధికారులు, వివిధ శాకల అధికారులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చి వేయడం ఖాయం : కవ్వంపల్లి

మానకొండూర్, మే1 : కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రాగానే రాజ్యాంగాన్ని మార్చి వేస్తారని డీసీసీ అధ్యక్షులు స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మానకొండూర్‌లో మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం దళిత సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మతం పేరుతో రాజకీయ పబ్బం గడుపుతున్న బీజేపీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం అధ్యక్షులు వాసాల సాయిచరణ్ ఆధ్వర్యంలో 30 మంది కవ్వంపల్లి సత్యనారాయణ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు కనకం అశోక్, మాజీ ఎంపీపీ మాతంగి లింగయ్య, మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రల కవిత, డీసీసీ కార్యదర్శి గసిగంటి సంపత్, ఎల్కపల్లి సంపత్, కోంద్ర సురేష్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం

తిమ్మాపూర్: మండలంలోని పలు గ్రామాలలో కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావు సతీమణి రేఖ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే అనేక అభివృద్ధి పనులు చేసిందని, బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీలను ప్రజలు నమ్మే స్థాయిలో లేరని అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావును గెలిపించాలని కోరారు.

రెండు లక్షల రుణమాఫీపై సీఎం పూటకోమాట


సమావేశంలో మాట్లాడుతున్న గంగాడి కృష్ణారెడ్డి

జమ్మికుంట మే1: రెండు లక్షల రుణమాఫీపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పూటకో మాట మాట్లాడుతు న్నారని ఎన్నికల తర్వాత ఎగనామం పెడతారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ జమ్మికుంట సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పనికి మాలిన రాజకీయ ఉపన్యాసం చేశారని రిజర్వేషన్ల అంశంపై అవాస్తవాలను ప్రచారం చేయడానికి సీఎం అంబాసిడర్‌గా మారారని అన్నారు. తప్పుడు ప్రచారంలో భాగస్వామ్యం అయినందునే ఢిల్లీ పోలీసులు నోటీసులు ఇచ్చారని గుర్తుచేశారు. కార్యక్రమములో జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి,జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రబెల్లి సంపత్ రావు, నాయకులు పెసర విజయ్ చందర్,మాడ గౌతమ్ రెడ్డి,జీడి మల్లేష్,శీలం శ్రీనివాస్,అకుల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

'కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుంది'

చొప్పదండి, మే1: కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని ఎమ్మెల్యే మెడిపల్లి సత్యం అన్నారు. బుధవారం ఆయన మండలంలోని చాకుంట, ఎదురుగట్టు, భూపాలపట్నం గ్రామాల్లో ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉంటే మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. రాష్ట్రంలో ప్రజాపాలన అధికారంలోకి వచ్చిన తరువాత ఆరు గ్యారంటీలను అమలు చేశామని ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. వడదెబ్బతో మృతిచెందిన రైతు రాజేశం కుటుంబాన్ని ఎమ్మెల్యే మెడిపల్లి సత్యం పరామర్శించారు. అనంతరం 10వేల రూపాయల ఆర్థికసాయాన్ని అందించారు.

ఓటరు స్లిప్పుల పంపిణీ

కరీంనగర్‌టౌన్, మే 1: పార్లమెంట్ ఎన్నికల ఓటర్ల స్లిప్స్‌లను మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బంది ఇంటింటికీ పంపిణీ చేస్తున్నారు. బుధవారం నగరపాలక సంస్థ కమిషనర్ బి.శ్రీనివాస్ మంకమ్మతోట, హౌజింగ్‌బోర్డుకాలనీ, భగత్‌నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి ఓటర్ స్లిప్స్ పంపిణీని ఆకస్మికంగా తనిఖీ చేశారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ కార్పొరేటర్

కరీంనగర్ అర్బన్, మే 1: కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ 7వ డివిజన్ కార్పొరేటర్ ఆకుల పద్మ, ఆమె భర్త బీఆర్‌ఎస్ నాయకులు, మాజీ కార్పొరేటర్ ఆకుల ప్రకాష్ బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంత్రి పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావుల ఆధ్వర్యంలో మంత్రి కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్పొరేటర్ ఆకుల పద్మ, మాజీ కార్పొరేటర్ ఆకుల ప్రకాశ్, బీఆర్‌ఎస్ నాయకులు పెండోట నరసింహచారి, ఆకుల ఉదయ్, వాసాల హరీశ్, ఏధులపురం శంకరాచారి, సూఫీయాన్, పసుపులేటి అనూష, కాసరపు కిరణ్, గండి గణేష్‌ల మెడలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పిన మంత్రి పార్టీలోకి ఆహ్వానించారు.

బీజేపీ మహిళా మోర్చా నాయకురాలు సుజాతరెడ్డి ప్రచారం

భగత్‌నగర్, మే 1: బీజేపీమహిళా మోర్చా రాష్ట్ర నాయకురాలు పి.సుజాతరెడ్డి ఆధ్వర్యంలో కోతిరాంపూర్‌లో బండి సంజయ్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్‌ను గెలిపించాలని ఇంటింటికి కరపత్రాలు పంచారు. ఈకార్యక్రమంలో పద్మజారెడ్డి, లక్ష్మి, వనజ పాల్గొన్నారు.

గుండెపోటుతో బెంగాల్ కార్మికుడి మృతి

కరీంనగర్ క్రైం, మే1: పశ్చిబెంగాల్‌కు చెందిన మంగల్‌దాస్(22) మంగళవారం అర్ధరాత్రి సమయంలో ఛాతిలో నొప్పి వస్తుందని తోటి కార్మికులైన బంధువులకు తెలపగా కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించే సరికి మృతి చెందినట్లు కొత్తపల్లి పోలీసులు తెలిపారు. మంగల్‌దాసు మరికొంతమంది ఉపాధి కోసం కొత్తపల్లి రైల్వేట్రాక్ పనులకు కరీంనగర్‌కు వచ్చారని, రెడ్డిరాంపల్లిలో నివాసం ఉంటున్న మంగల్‌దాస్ గుండెపోటుతో మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి బంధువులు బుధవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని పోలీసులు తెలిపారు.

'వెలిచాల రాజేందర్‌రావును గెలిపించండి'

కరీంనగర్ అర్బన్, మే 1 : కరీంనగర్ సమగ్రాభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే ఆరేపల్లి మోహన్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ఆకారపు భాస్కర్‌రెడ్డి అన్నారు. నగరంలోని 53వ డివిజన్‌లో కాంగ్రెస్ ఎస్సీ సెల్ మాజీ చైర్మన్ ఉప్పరి రవి ఆధ్వర్యంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ డివిజన్ ఎన్నికల కార్యాలయాన్ని డివిజన్ ఇంచార్జి ఆకారపు భాస్కర్‌రెడ్డి ప్రారంభించారు.

● 54వ డివిజన్ కశ్మీర్‌గడ్డ రైతుబజార్‌లో కరీంనగర్ కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావును గెలిపించాలంటూ కాంగ్రెస్‌పార్టీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షులు ఎండీ తాజొద్దీన్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు.

'ట్రినిటి'లో క్యాంపస్ ప్లేస్‌మెంట్

కరీంనగర్ రూరల్, మే1: మండలంలోని బొమ్మకల్ గ్రామ పరిధిలోని ట్రినిటి ఇంజనీరింగ్ కళాశాలలో ఎంబీఏ, ఇంజనీరింగ్ విద్యార్థులకు బంధన్ బ్యాంక్, వల్లీ ఎంటర్‌ప్రైజ్ ఆధ్వర్యంలో క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహిం చారు. ఇంటర్వ్యూలు నిర్వహించి 65 మందిని ఎంపిక చేశారు. విద్యా ర్థులను కళాశాల చైర్మన్ దాసరి ప్రశాంత్ అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగేంద్ర, ఏఓ రాధాకృష్ణ, ప్లేస్‌మెంట్ అధికారి నవీణ్ కుమార్ పాల్గొన్నారు.

కుక్కల దాడిలో దూడలు మృతి

కరీంనగర్ రూరల్, మే1: మండలంలోని గుంటూరుపల్లిలో కుక్కల దాడిలో రెండు గేదే దూడలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన కుంబం నర్సయ్య గేదేల పెంపకంతో ఉపాధి పొందుతున్నాడు. మంగళవారం తెల్లవారు జామున ఇంటి ముందు కట్టేసి ఉన్న రెండు గేదె దూడలపై వీధి కుక్కలు దాడి చేశాయి. దీంతో రెండు గేదె దూడలు అక్కడికక్కడే మృతి చెందాయి.

4న ఎమ్మార్పీఎస్ చలో హైదరాబాద్

గంగాధర, మే 1: పార్లమెంటు ఎన్నికల్లో మాదిగలను విస్మరించిన కాంగ్రెస్ వైఖరికి నిరసనగా ఎమ్మార్పీఎస్ ఈ నెల 4న తలపెట్టిన చలో హైదరాబాద్‌ను విజయ వంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్ అన్నారు. బుధవారం గంగాధరలో ఏర్పా టు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడా రు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టబద్ధతకు హామీ ఇచ్చి అమలు చేయకుండా మాదిగలను మోసం చేసి న కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లను పార్లమెం టు ఎన్నికల్లో గుణ పాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలోచిలుముల రాజ య్య, తడగొండ శంకర్, కొత్తూరి రాజన్న, దండు అంజ య్య, సముద్రాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

ఇల్లందకుంట, మే 1: మండలంలోని బూజునూర్ గ్రామానికి చెందిన శ్రీపతి సూర్యం పాప రమ్య, శ్రీపతి మల్లయ్యలు ఇటీవల మృతి చెందగా వారి కుటుంబా లను ఎంపీపీ సరిగోమ్మల పావని-వెంకటేష్ బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు రూ. 5వేల నగదు, 50కేజీల బియ్యం చొప్పున పంపిణీ చేశారు.

బాధిత కుటుంబానికి బియ్యం అందజేత

తిమ్మాపూర్, మే1: మండలంలోని మన్నెంపల్లి గ్రామంలో మోతే మల్లమ్మ అనే వృద్ధురాలు పాము కాటుతో మృతి చెందగా వారి కుటుంబాన్ని గ్రామ మాజీ ఉపసర్పంచ్ పొన్నం అనిల్ గౌడ్ పరామర్శించి 50కిలోల బియ్యం అందజేశారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక

హుజూరాబాద్‌రూరల్, మే1: మండలంలోని సింగాపూర్ గ్రామంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ వొడితల ప్రణవ్ సమక్షంలో బుధవారం కందుల మాజీ సర్పంచ్ ఎండి నూరుల్లా, మండల మైనార్టీ బీజేపీ మోర్చా అధ్యక్షులు మాదం సమ్మయ్య, మాజీ వార్డు మెంబర్ వీరబోయిన రవీందర్, మాజీ వార్డు మెంబర్ ఎండీ సర్వర్, ఎండీ షహీద్‌లు కాంగ్రెస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా పార్టీలో చేరిన నాయకులకు వొడితల ప్రణ వ్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

● గన్నేరువరం: మాజీ జడ్పీటీసీ, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు జువ్వాడి మన్‌మోహన్‌రావు బుధ వారం మండల కేంద్రంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనా రాయణ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈయనతో పాటు పీచుపల్లి మాజీ సర్పచ్ పీచు చంద్రారెడ్డి, వివిధ కుల సంఘాలకు చెందిన సుమారు 50 మంది కాంగ్రెస్‌లో చేరగా వీరికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

విద్యార్థిని ఆకస్మిక మృతి

రామడుగు: మండలంలోని వెలిచాల గ్రామానికి చెందిన విద్యార్థిని జక్కుల శ్రీలక్ష్మి(14) గుండెపోటుతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. జ్వరంతో బాధపడుతుండగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. శ్రీలక్ష్మి కొత్తపల్లి మండలం చింతకుంట సోషల్ వెల్ఫేర్‌స్కూల్‌లో తొమ్మిదో తరగతి పూర్తి చేసింది.